ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పొందూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

పొందూరు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, పారదర్శక పాలనతో మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొల్లిపేట, లైదాం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లన సూర్యారావు, నాయకులు మీసాలరామినాయుడు, జమ్మి నాయుడు, వండాన వెంకటరావు, కొంచాడ గిరిబాబు, కొల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

పోలాకి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పిన్నింటిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలు చూడకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు సాలిన నగేష్‌కుమార్, గురివిల్లి అప్పారావు, పైల శేఖరరావు, కూన ఢిల్లీశ్వరరావు, చింతాడ వెంకటరావు, పలువురు సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధే సీఎం జగన్ ఆశయం

కొత్తూరు: ఆదివాసీల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని అడ్డంగి, అబలాసింగి, చాపరాయిగూడ, మూర్తుమానుగూడతోపాటు పలు గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కరోనా కష్ట కాలంలో సీఎం జగన్ ఆదుకున్నారని పలువురు గిరిజనులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు మంజూరు చేశారన్నారు. ఎరువులు, విత్తనాలను రాయితీపై ఆర్‌బీకేల ద్వారా అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో రోడ్లు బాగు చేయకపోవడంతో గిరిజనులకు 108 సేవలు అందక ఇబ్బంది పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు గిరిజన గ్రామాలకు రోడ్లు వేశామన్నారు. గిరి శిఖరంలో ఉన్న అబలాసింగి గిరిజన గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాచణ, సర్పంచ్ సవర కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు సవర సుశీక, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, పంకజదాస్, రాజులు నాయుడు, సాధుబాబు, రాడ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలాకి: పిన్నింటిపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: అబలాసింగిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

క్లుప్తంగా

ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు ప్రమాణస్వీకారం



ఖండాపు గోవిందరావును అభినందిస్తున్న అధికారులు, డైరెక్టర్లు

బూర్జ: ఏపీ టిడ్కో డైరెక్టర్‌గా ఖండాపు గోవిందరావు విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈయనది బూర్జ మండలంలోని మదనాపురం. ఈయనకు టిడ్కో డైరెక్టర్లు పి.రాఘవరావు, కె.నాగేశ్వరి, టిడ్కో ఆఫీస్ సిబ్బంది, బూర్జ మండల పెద్దపేట గ్రామ ఉపసర్పంచ్ డి.వి.నాయుడు, గ్రామస్తులు పి.రామకృష్ణ, జి.జగన్ తదితరులు అభినందిచారు. తదనంతరం ఖండాపు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్పీకర్ తమ్మినేని సీతారాంకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈఓపీఆర్డీకి సత్కారం



రవికుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: మండలంలో ఈఓపీఆర్డీగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసి ఉద్యోగోన్నతిపై సంతకవిటి మండలానికి బదిలీపై వెళ్తున్న జీవీ రవికుమార్ సేవలను ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీడీఓ బి.మధుసూదనరావు కొనియాడారు. రవికుమార్‌ను మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న తన కింది స్థాయి సిబ్బందితో పనిచేయిస్తూ నరసన్నపేట మండలాన్ని జిల్లాలో ముందు వరుసలో నిలిపారన్నారు. సచివాలయ సిబ్బందికి అనేక సూచనలు చేస్తూ వారి పనితీరును మెరుగుపర్చారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురంలో సచివాలయం నిర్మించాల్సిన స్థలం (సర్వే నంబర్ 291లో 8 సెంట్ల స్థలం) ఓ వ్యక్తి ఆక్రమించుకుని గృహ నిర్మాణం చేట్టాడని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు సోమవారం నిర్వహించిన స్పందనలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సచివాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురైందన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించి, ఆక్రమణదారునికి నోటీసులు ఇచ్చారనీ, నెలలు గడుస్తున్నా దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదని వివరించారు. విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుడిని నుంచి కాపాడాలని విన్నవించారు. అప్పట్లో ఈ విషయంపై కలెక్టర్, టెక్కలి సబ్‌కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసినవారిలో ఉర్లాన రుషి, ఉర్లాన నీలకంఠం, తూలుగు నూకరాజు, బైపోతు సోమేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



పూజలు అందుకుంటున్న శివపార్వతులు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో గల సోమలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం లక్ష తులసీదళార్చన, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదంలో భారీగా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సోమలింగేశ్వరస్వామి వారిని గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. పెద్దలోగిడి, చిన్నలోగిడి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి పాలన పేదలకు వరంగా మారిందని, నాలుగేళ్ల పాలన ఎంతో విజయవంతమైందని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అన్నారు. సీఎం జగన్, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ శిష్టకరణాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఈ కులం అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో దోహదపడుతున్నారన్నారు. శిష్టకరణాలకు వైఎస్ కుటుంబం ఎంతో మేలు చేసిందని, వారికి రుణపడి ఉంటామన్నారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని ఆకాంక్షించారు. శిష్టకరణ సంఘం ప్రతినిధులు ఆర్.శ్రీధర్(బుజ్జి), ఎస్.ప్రభాకరరావు, వసంతకుమార్, ఎస్.సింహాచలం, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్, ఎమ్మెల్యే కృష్ణదాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణ, తదితరులు

మన గ్రామం-మన చెరువును అభివృద్ధి చేయాలి

మెళియాపుట్టి: ఉపాధి హామీలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమృత్ సరోవర్ చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి గ్రామప్రజలందరూ సమష్టి కృషి చేయాలని వ్యవసాయశాఖ సంచాలకులు మధుబాబు, ఏపీడీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం, మూల ముకుందాపురం, పరశురాంపురం గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువులను సోమవారం పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అమృత్ సరోవర్ చెరువుల పనులు ఎంతశాతం పూర్తయ్యాయో తెలుసుకోవడానికి మండలంలో పర్యటించినట్లు తెలిపారు. అమృత్ సరోవర్ చెరువుల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ఇది మొదటి మెట్టు అని అన్నారు. అనంతరం వేతనదారులతో మాట్లాడారు. వేసవితీవ్రత నేపథ్యంలో చల్లటి సమయాలలో కనీసం రోజుకు ఆరు గంటలపాటు పనిచేయాలన్నారు. నిర్దిష్ట వేతనం వచ్చేలా సిబ్బంది కొలతలు ఇవ్వాలన్నారు. ప్రతీఒక్కరూ పనుల్లోకి తాగునీటిని తీసుకెళ్లాలన్నారు. వేతనదారులు చేసిన పనిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ తిరుపతి పట్నాయక్, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్‌లు బైపోతు ఉదయ్‌కుమార్, ప్రసాద్, భాస్కరరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆక్రమణదారులకు నోటీసులు

కొత్తూరు: కొత్తూరు రెవెన్యూ గ్రూపు పరిధిలోని 270 సర్వే నంబర్‌లో ఉన్న నాయుడు చెరువు ఆక్రమణదారులుగా గుర్తించిన 17 మందికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ చక్రవర్తి సోమవారం తెలిపారు. చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఈ విషయంపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీస్‌లు జారి చేశామన్నారు. నోటీస్ అందిన 15 రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే ప్రభుత్వమే తొలగిస్తుందన్నారు. నాయుడు చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నందున..ఆ నిర్మాణాలు నిలుపుదల చేయాలని సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో కొంత మంది ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువులో చేపట్టిన నిర్మాణాలను డీటీ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. చెరువు స్థలాన్ని విడిచిపెట్టి జిరాయితీలో పనులు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చెరువు స్థలంలో నిర్మాణాలు చేయకూడదని.. నిర్మాణదారులకు ఆదేశించడంతోపాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సువ్వారి గాంధీ

ఆమదాలవలస: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన బాధితుల పట్ల సీఎం జగన్ మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. సీఎం జగన్‌కు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వారు కోలుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయడమే కాకుండా పరిహారాన్ని కూడా ప్రకటించి ఆదుకున్నారని తెలిపారు. మృతి చెందినవారికి రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున మంజూరు చేశారన్నారు. సహాయక చర్యల్లో ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల హర్షం వ్యక్తమవుతుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

మండల పరిషత్ ఏఓగా చిన్నమ్మడు

సారవకోట: మండల పరిషత్ ఏఓగా చిన్నమ్మడును నియమంచారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రసాదరావు కొత్తూరు ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా బదిలీపై వెళ్లారు. కొత్తూరు ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా పనిచేస్తున్న చిన్నమ్మడు ఇక్కడకు వచ్చారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి

పొందూరు: పొందూరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంత వేణు డిమాండ్ చేశారు. పొందూరు పంచాయతీ కార్యాలయం సమీపంలోని పారిశుద్ధ్య కార్మికుల నిర్వహిస్తున్న నిరవధిక దీక్షలో సోమవారం పాల్గొని మాట్లాడారు. కార్మికుల వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. దీనికి అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమన్నారు. దళిత ఐక్యవేదిక నాయకులు కుమిలి రాజేష్, నాయకులు పడాల నాగరాజు, కనకరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆమదాలవలస రూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని వ్యాపారవేత్త జేజే మోహనరావు అన్నారు. మండలంలోని అక్కులపేట గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను సత్కరించారు. సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సూర్యారావు, సమన్వయకర్త సాయికృష్ణ, వెంకటరావు, మన్మథ, షణ్ముఖరావు, అరుణ, శ్యామల, సంజన పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

బూర్జ: మండలంలోని లాభాం గ్రామానికి చెందిన నక్క పద్మావతి పిడుగుపాటుకు గురై ఆదివారం మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని తహసీల్దార్ ఎస్.రమణారావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు వేర్వేరుగా సోమవారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తహసీల్దార్ అన్నారు. వీఆర్వో మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అయిల్‌పామ్ సాగుతో ఆదాయం

పొందూరు: అయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎంతో ఆదాయం చేకూరుతుందని రణస్థలం సహాయ వ్యవసాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్, పతంజలి, హార్టికల్చర్, అగ్రికల్చర్ సంయుక్తంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఆయిల్‌పామ్ పంటకు వరదలు, తుఫానుతో ముప్పు ఉండదన్నారు. ఈ సాగును ఉపాధితో అనుసంధానం చేశారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారులు బెండి బాబ్జి, ఈ.ఆర్.ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీలమణిదుర్గ అమ్మవారి మారువారం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి (మారు వారం) మంగళవారం నిర్వహించనున్నారు. ఈ ఏడాది మే 21 నుంచి 30వ తేదీ వరకు పెద్ద పండగలు నిర్వహించారు. పెద్దపండగలు ముగిసిన తరువాత వచ్చే మంగళవారం అమ్మవారికి గ్రామస్తులందరూ కలిసి ముర్రాటలు తీసుకురావడం అనవాయితీ. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకిరించారు. భారీ గేట్లు ఏర్పాటు చేశారు. పాతపట్నం సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

11న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట ఏ.పీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 11వ తేదీన 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లను విద్యాలయం వెబ్‌సైట్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో మండాది, ఈసర్లపేట, తాళ్లవలస గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జల్‌జీవన్ పథకంలో భాగంగా రూ.235 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ముందుండాలని అన్నారు. గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి తక్షణమే సంక్షేమ పథకాలు అందించాలని సిబ్బందికి సూచించారు.

జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంటి కృష్ణ, రెడ్డి నర్సింగరావు, ఎన్ని రామచంద్రరావు, గురుగుబెల్లి నీలారావు, తాండ్ర ధనుంజయరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.పి.సూర్యనారాయణ, జేఈ కె.చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి బి.నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మండాదిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

నిత్యావసర సరుకులన్నీ అందించాలి

హిరమండలం: రేషన్ డీపోల ద్వారా మండలంలోని అన్ని గ్రామాల రేషన్ కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులన్నీ సక్రమంగా అందించాలని సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ సంధ్య మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా విత్తనాలను అందజేస్తున్నామన్నారు. ఇప్పటికే యాంత్రికరణ పేరుతో ట్రాక్టర్‌లు, పలు వ్యవసాయ పరికరాలను రైతులకు అందించామన్నారు. ఎరువులు కూడా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డుదారులందరికీ సక్రమంగా రేషన్ అందిస్తున్నామన్నారు. పలువురు సభ్యులు రేషన్ డీపోల ద్వారా చాలా గ్రామాల్లో కందిపప్పు, ఇతర సరుకులు అందడం లేదని, ఒక్క బియ్యం మాత్రమే అందుతున్నాయన్నారు. వైద్యుడు ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియాపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎంపీడీఓ శైలజ నియామకంపై సభ్యులు హర్షం వ్యక్తం చేసి సన్మానించారు. ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, శంకరరావు, ఎంఈఓ రాంబాబు, ఏపీఓ శ్రీనివాసరావు, దేవి, కో-ఆప్షన్ సభ్యుడు విష్ణు ప్రసాద్, పలువురు ఎంపీటీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కోడూరు సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కేడర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అవకాశవాదుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పార్టీ కష్టకాలంలో సైతం నిలబడిన నాయకులే తమకు ముఖ్యమన్నారు. సచివాలయ వ్యవస్థ పేరువింటేనే ప్రతిపక్షాలకు నిద్రపట్టడంలేదని, వీలైనంత తొందరగా శతశాతం సచివాలయ భవనాలు పూర్తిచేసి ప్రజలకు అందించాలని కాంట్రాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

హిరమండలం: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ తూలుగు మేనక అన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి హిరమండలంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 98 శాతం మేనిఫెస్టోను అమలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రెండేళ్ల కరోనా విపత్తులతో ఉపాధి కోల్పోయిన ప్రజలకు ఆర్థిక భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రిపై టీడీపీ నాయకుల విమర్శలు అర్థరహితమన్నారు. మూలపేట పోర్టు, వంశధార ఎత్తిపోతల పథకంతో జిల్లా రూపురేఖలే మారిపోయాయన్నారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో చేయూతనందిస్తోందన్నారు.

పాతపట్నం అమ్మవారి పండుగలకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరించిందన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాతపట్నంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, దేవి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుంకరి కోటేశ్వరరావు, సింహాచలం, విష్ణుప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణం దినోత్సవం
- మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జలుమూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా జలుమూరులో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సోమవారం మొక్కలు నాటి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏఓ సురేష్ కుమార్, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఏడాదికి ఐదు మొక్కలు నాటాలని వైకేపీ సీఎఫ్ ధర్మారావు, ఉపాధి పథకం ఎఫ్ఏ ఎస్.మురళీ, ఐటీసీ ప్రతినిధులు అన్నారు. కోతిగార్లపాడు, సరడాం గ్రామాల్లో సోమవారం మొక్కలు నాటారు.

నరసన్నపేట: పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మహిళలు, వెలుగు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.లత ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. నేచర్ సొసైటీ ఆధ్వర్యంలో నరసన్నపేట జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పాతపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, పర్యావరణాన్ని కాపాడాలని సవర సిద్దమనుగు సర్పంచ్ సింధు అన్నారు. గ్రామంలో సీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణతోనే మానవాలి మనుగడ ఉందని అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ శామ్యూల్ అరుణ్‌కుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలోని పలుచోట్ల మొక్కలు నాటారు.

హిరమండలం: మొక్కలు నాటడమేకాకుండా సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎం.అవలంగి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొల్లవాడు అన్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.



జలుమూరు: ప్రమాణం చేస్తున్న ఐకేపీ, వ్యవసాయశాఖల సిబ్బంది